పాలన గాడిన పడేనా?

18 మందితో ఏనుమాముల మార్కెట్ కమిటీ ఏర్పాటు

- కొత్త పాలకవర్గానికి సవాల్ విసరనున్న సమస్యలు
- అధికారులు, ఉద్యోగుల్లో కొరవడిన సమన్వయం


వరంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రధాన ద్వారం

వరంగల్: ఏనుమాములలోని వరంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీకి నూతన పాలకవర్గాన్ని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ జారీ చేసింది. మార్కెట్‌లో పేరుకుపోయిన సమస్యలు పరిష్కరించే పెద్ద బాధ్యత పాలకవర్గంపై ఉంది. 2023 ఆగస్టు 16న పాలకవర్గం గడువు ముగిసింది. ఎన్నికలు ఉన్న నేపథ్యంలో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కొత్త కమిటీని ఏర్పాటు చేయలేదు. నవంబర్‌లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఏకాభిప్రాయం లేకపోవడంతో సుమారు ఏడాదిన్నరగా పాలకవర్గం లేకుండానే మార్కెట్ వ్యవహారాలు సాగుతున్నాయి. దీంతో మార్కెట్‌లోని అధికారులు, ఉద్యోగుల్లో సమన్వయం లేకపోవడంతో పాలన మొత్తం అస్తవ్యస్తంగా తయారైంది. ఎట్టకేలకు 18 మందితో మార్కెట్ కమిటీకి రాష్ట్ర ప్రభుత్వం పాలకవర్గాన్ని నియమించింది.

నిరాశలో తూర్పు నేతలు..

ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని పలువురు కాంగ్రెస్ నాయకులు ఆశించారు. వర్ధన్నపేట నియోజకవర్గంలోని గోపాల్‌పూర్‌కు చెందిన నాయకుడి సతీమణికి పదవి దక్కడంతో తూర్పు సీనియర్లు నిరాశ నిస్పృహల్లో మునిగిపోయారు. నియోజకవర్గంలో షాడో నేతగా ప్రచారం జరుగుతున్న నేత మాత్రం తన బంధువుకు కీలక పోస్టు ఇప్పించుకున్నాడన్న చర్చ సాగుతోంది. తూర్పునకు చెందిన ఇద్దరికి మార్కెట్ కమిటీలో అవకాశం కల్పిస్తామని నేతలు హామీ ఇచ్చి నెరవేర్చకపోవడంతో శ్రేణులు నిరాశ చెందాయి.

నూతన కమిటీ ఇదే..

ఏనుమాముల వరంగల్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా ఎర్ర ప్రియాంక, వైస్‌చైర్మన్‌గా బండి జనార్దన్, సభ్యులుగా గదరబోయిన రాజు, దనికుల రాంబాబు, చల్లా వాసుదేవరెడ్డి, గొడుగు భిక్షపతి, బదావత్ నర్సింహనాయక్, ఆకుల రుద్ర ప్రసాద్, బొడ్డు ప్రదీప్‌కుమార్, కత్తి సంపత్, మహ్మద్ సాబేరా, అచ్చ నాగరాజు, దుగ్యాల గోపాల్‌రావు, గజ్జెల శ్యాంసుందర్‌ను నియమించింది. జిల్లా మార్కెటింగ్ అధికారి, ఖిలా వరంగల్ పీఏసీఎస్ చైర్మన్, వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు, మేయర్ ఎక్స్ అఫీషియో సభ్యులుగా కొనసాగుతారు. ఈ పాలకవర్గం వచ్చే రెండేళ్లపాటు లేదా తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు కొనసాగుతుందని జీఓలో పేర్కొన్నారు. ఈ కమిటీలో వాణిజ్య, వ్యాపారవర్గానికి చెందిన వారికే అవకాశాలు దక్కినట్లు తెలుస్తోంది.


ఎర్ర ప్రియాంక, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్


బండి జనార్దన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్

సమస్యల చిట్టా...

వరంగల్ మార్కెట్‌లో మొత్తం 110 మంది అధికారులు, ఉద్యోగులు ఉండాలి. కేవలం 30 మంది లోపు ఉండడంతో పరిపాలన మొత్తం అస్తవ్యస్తంగా తయారైంది. గత ప్రభుత్వ హయాంలో లక్ష్మీపురం మోడల్ మార్కెట్ ప్రారంభ సమయంలో మడిగెలు, ప్లాట్ల కేటాయింపుల్లో అక్రమాలు జరిగినట్లు ఫిర్యాదు రావడంతో మంత్రి సురేఖ విచారణకు ఆదేశించారు. అప్పటి నుంచి విచారణ అటకెక్కింది. అదేవిధంగా మోడల్ మార్కెట్‌లో కేటాయించినా మడిగెలు, ప్లాట్‌ఫారాలతోపాటు కమర్షియల్ షట్టర్లకు సంబంధించిన అద్దె బకాయిలు రూ.2కోట్లకుపైగా పేరుకుపోయాయి. కొంత మంది కోర్టుకు వెళ్లగా గ్రేడ్–2 అధికారులు పట్టించుకోకపోవడంతో ఆ షట్టర్లు ఖాళీగా ఉన్నాయి. దీనికి తోడుగా మార్కెట్‌లో పారిశుద్ధ్య పనులు, ఇతర విషయాలను పట్టించుకునే వారే లేకుండా పోయారు. పాలకమండలి ఏర్పాటు కావడంతో మార్కెట్ నిర్వహణ, పాలన గాడిన పడుతుందని నగర ప్రజలు, మార్కెట్‌కు వచ్చే వినియోగదారులు, రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఫిబ్రవరి మొదటి వారంలో కొత్త పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేసేందుకు సమాయత్తం అవుతున్నట్లు సమాచారం.

క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 30న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కిషన్‌పుర, లష్కర్ బజార్, పద్మాక్షి కాలనీ, శివముక్తి ధామ్, రాజ్‌పుత్ వాడ, జయ కళాశాల ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు ప్రొఫెసర్ జ్యోతి సంస్మరణ సభ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ తెలుగు విభాగం ఆధ్వర్యంలో ఆ విభాగం ప్రొఫెసర్ దివంగత ఏటూరి జ్యోతి సంస్మరణ సభను ఈనెల 30న ఉదయం విభాగం సెమినార్ హాల్‌లో నిర్వహించనున్నారు.

జాతీయ స్థాయి పోటీలకు గురుకుల విద్యార్థినుల ఎంపిక

మడికొండ: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల బాలికలు ఈనెల 26వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ దాసరి ఉమామహేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు క్రీడాకారులు పి.శరణ్య, జ్యోతి, అంజలిని ప్రిన్సిపాల్‌తోపాటు పీడీ పద్మ, పీఈటీ సరిత, ఉపాధ్యాయులు బుధవారం అభినందించారు.

స్కాలర్స్ ప్రీమియర్ లీగ్ ప్రారంభం

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లో స్కాలర్స్ ప్రీమియర్ లీగ్ –25 క్రికెట్ పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించి మాట్లాడారు. రీసెర్చ్ స్కాలర్స్ పరిశోధనలతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. పోటీల్లో పది టీంలు పాల్గొననున్నాయి. కార్యక్రమంలో డీన్ శ్రీనివాసాచార్య, స్పోర్ట్స్ సెంటర్ అధిపతి పి.రవికుమార్, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



హన్మకొండ: పేరుకుపోయిన ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలంగాణ ఉపాధ్యాయులు కోరారు. ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్ గెలుపు కోసం ప్రచారంలో భాగంగా హనుమకొండకు వచ్చిన పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ముదిరేసి చెన్నయ్యను హరిత కాకతీయ హోటల్‌లో బుధవారం కలిసి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మన్నె చంద్రయ్య, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి పులి దేవేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావుల్‌కార్ వెంకటేష్, రమేష్, రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



మామునూరు: భక్తులు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని బొల్లికుంట వాగ్దేవి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ జి.కమల్ యాదవ్ పిలుపునిచ్చారు. ఈమేరకు ఐనవోలు మల్లన్న జాతరలో వాగ్దేవి ఫార్మసీ కళాశాల ఫార్మసీ విద్యార్థుల ఆధ్వర్యంలో వరంగల్ మెడికవర్ ఆస్పత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. భక్తులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చందపట్ల వాణిదేవి, ఫార్మడీ అధిపతి డాక్టర్ రవిచందర్, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ చంద్రప్రకాశ్, రమేష్, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

కేడీసీలో అవేర్‌నెస్ ప్రోగ్రాం

విద్యారణ్యపురి: హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో డాక్టర్ కేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో హెల్త్ అవేర్‌నెస్ ప్రోగ్రాంను ఏర్పాటుచేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సీతారాములు, డాక్టర్ కేర్ సంస్థ సీఎండీ డాక్టర్ ఏఎంరెడ్డి, వైద్యులు డేవిడ్, నిఖిల్, శంకర్ సింగ్, నిఖిల్‌తేజ, సీఆర్‌ఓ పూజిత, ఫార్మసిస్ట్ యశ్వంత్, తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికితీయాలి



ఖిలా వరంగల్: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తూ వారిలో దాగిఉన్న సృజనాత్మకత శక్తిని వెలికితీయాలని పోలీస్ శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ (ఎస్పీ) సూచించారు. వరంగల్ ఉర్సు గుట్ట బైపాస్ రోడ్డులోని తాళ్ల పద్మావతి ఇంటర్నేషనల్ స్కూల్‌లో విద్యాసంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం ఆధ్వర్యంలో స్కూల్ వార్షికోత్సవం బుధవారం జరిగింది. ముఖ్యఅతిథిగా ఆమె హాజరై మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు వరుణ్, వైష్ణవి, వంశీ, చైతన్య, హెచ్‌ఎం స్వర్ణ తగరం, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల బైక్ ర్యాలీ


బైక్ ర్యాలీలో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు

కేయూ క్యాంపస్: యూనివర్సిటీల్లో దీర్ఘకాలంగా పనిచేస్తున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ కాకతీయ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ల కోఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో కేయూ మొదటి గేట్ నుంచి రెండో గేట్ వరకు బుధవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ బాధ్యులు డాక్టర్ మాదాసి కనకయ్య, డాక్టర్ సతీష్, డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోథ్, డాక్టర్ సాదు రాజేష్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరారు. నిరసన కార్యక్రమంలో అసోసియేషన్ బాధ్యులు సత్యజాల, నాగేశ్వర్ రావు, శ్రీనివాస్, నాగయ్య, ప్రసాద్, సూర్య నారాయణ, వెంకటేష్, మధుకర్, రఘువర్ధన్ రెడ్డి, చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, చందులాల్, కవిత, స్వప్న, రాధిక, రమాదేవి, కల్పన, సునీత తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు తీపి కబురు

వరంగల్ అర్బన్: వరంగల్ బల్దియా దినసరి, కాంట్రాక్టు కార్మికులు అర్బన్ మలేరియాకు చెందిన 90 మంది కార్మికులకు రోజువారీ వేతనం రూ.427 నుంచి రూ.694, కాంట్రాక్టు పద్ధతిపై పనిచేస్తున్న 452 మంది కార్మికులకు రూ.13వేల నుంచి రూ.16,600 పెంచుతూ కౌన్సిల్ బుధవారం తీర్మానం చేసి ఏకగ్రీవంగా ఆమోదించింది.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై చిత్తశుద్ధితో ఉన్నాం

- ఎమ్మెల్యేలు నాగరాజు, ప్రకాశ్‌రెడ్డి


ఎమ్మెల్యే నాగరాజుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కమిటీ సభ్యులు

హన్మకొండ: గ్రేటర్ వరంగల్ పరిధిలోని జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇప్పించడంపై చిత్తశుద్ధితో ఉన్నామని వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు, పరకాల రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. హనుమకొండలోని స్వగృహాల్లో ఇరువులు ఎమ్మెల్యేలను తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ హనుమకొండ జిల్లా కమిటీ సభ్యులు బుధవారం వేర్వేరుగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలకు పుష్పగుచ్ఛాలు అందించి నూతన కమిటీని పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మస్కపురి సుధాకర్, రాజ్‌కుమార్, ఉపాధ్యక్షులు చింతల సత్యనారాయణ, సిరిమల్ల సదానందం, గోకారపు శ్యామ్, బొడిగె శ్రీనివాస్, దొమ్మాటి శ్రీకాంత్, సంయుక్త కార్యదర్శులు బత్తిని రాజేందర్, బొమ్మగాని ఆదర్శ్‌గౌడ్, పాడిశెట్టి కర్ణాకర్ పాల్గొన్నారు.

బీసీ యుద్ధభేరిని విజయవంతం చేయాలి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రమేష్, తదితరులు

విద్యారణ్యపురి: ఫిబ్రవరి 2న హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో నిర్వహించనున్న బీసీల రాజకీయ యుద్ధభేరి సభను విజయవంతం చేయాలని బీసీ విద్యావంతుల వేదిక ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు, కేయూ పాలకమండలి సభ్యుడు డాక్టర్ చిర్ర రాజు కోరారు. ఈమేరకు కేయూ సమీపంలోని ప్లాజాలో ముదిరాజ్ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవి ఆధ్వర్యంలో సభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

నయీంనగర్: చట్ట సభల్లో, విద్యా ఉద్యోగ రంగాల్లో బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని, సమస్యల పరిష్కారానికి పోరాటం చేయడానికి ఫిబ్రవరి 2న నిర్వహించతలపెట్టిన బీసీ రాజకీయ యుద్ధభేరి సభను విజయవంతం చేయాలని ఉమ్మడి వరంగల్ జిల్లా బీసీ ఇంటలెక్చువల్ ఫోరం స్టేట్ జాయింట్ సెక్రటరీ డాక్టర్ కూరపాటి రమేష్, కోఆర్డినేటర్లు పిలుపునిచ్చారు. ఈమేరకు హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ బీసీలకు స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్, అగ్రవర్ణాల (ఈడబ్ల్యూఎస్) 10 శాతం రిజర్వేషన్ రద్దు చేయాలని కోరారు.

సీసీ కెమెరాల నిబంధన సరికాదు


మంత్రి సీతక్కతో అసోసియేషన్ ప్రతినిధులు

హన్మకొండ: రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గిరిజన, మహిళా సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్కను ప్రైవేట్ జూనియర్ కాలేజీల యాజమాన్యం ప్రతినిధులు హైదరాబాద్‌లో బుధవారం కలిశారు. సీసీ కెమెరాల మధ్య ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించడాన్ని రద్దు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. వరంగల్ ప్రైవేట్ జూనియర్ కాలేజ్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి, సభ్యులు మూగల కుమార్ యాదవ్, వేణుగోపాల్ గౌడ్, అశోక్ రెడ్డి, జక్కుల రాజు, జె.శివ, నరేందర్, కర్ణాకర్, ధనుంజయ్, శ్రీకాంత్, మహేష్, కనకరాజు, భిక్షపతి, శ్రీరామ్ రెడ్డి, తిరుపతి రెడ్డి, ఇంద్రసేన రెడ్డి పాల్గొన్నారు.

ఎస్సీ రిజర్వేషన్ అమలు చేయాలి


వరంగల్: మాట్లాడుతున్న మంద కుమార్‌మాదిగ

వరంగల్: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జాతీయ నాయకులు మంద కుమార్ మాదిగ, బొడ్డు దయాకర్ మాదిగ డిమాండ్ చేశారు. వరంగల్ 18వ డివిజన్‌లోని ప్రతాప్‌నగర్ అంబేడ్కర్ భవన్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల జిల్లా కార్యవర్గ సమావేశం ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కట్ల రాజశేఖర్ మాదిగ అధ్యక్షతన జరిగిన సమావేశంలో దయాకర్, సూరన్న, బి.మహేందర్, ప్రణయ్‌దీప్, విజయ్ పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేయాలి

కాజీపేట: ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరగనున్న మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ డప్పు, వాయిద్యాలు, కోలాటలతో కాజీపేట చౌరస్తాలో నృత్యాలు చేశారు. సురేందర్ మాదిగ, మనోహర్, కుమార్, అరూరి సాంబయ్య, ఇమ్మడి బాబు, సందెల విజయ్ కుమార్, మాచర్ల ప్రభాకర్, బి.వినయ్, మేకల రవీందర్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

వర్సిటీల స్వయంప్రతిపత్తిని కాపాడుకుందాం

కేయూ క్యాంపస్: యూనివర్సిటీలను కాపాడుకుందామని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు స్టాలిన్, జనరల్ సెక్రటరీ శ్రీకాంత్ అన్నారు. యూజీసీ నూతన ముసాయిదాను రద్దుచేసి డిమాండ్ చేశారు. కాకతీయ యూనివర్సిటీలో పరిపాలన భవనం వద్ద కరపత్రాలను ఆవిష్కరించారు.

అలుమ్నీ హాల్‌కు ఏసీ బహూకరణ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ ఎస్‌డీఎల్‌సీఈ డైరెక్టర్, పొలిటికల్ సైన్స్ పూర్వ విభాగం అధిపతి ప్రొఫెసర్ రాంచంద్రం బుధవారం ఆ విభాగంలోని అలుమ్నీ నూతన హాల్‌కు ఏసీని బహూకరించారు.

'ఉద్యోగ విరమణ' ఆనందదాయకం

కేయూ క్యాంపస్: సంతృప్తితో కూడిన ఉద్యోగ విరమణ ఆనందదాయకమని కాకతీయ యూనివర్సిటీ ఫైనాన్స్ ఆఫీసర్ తోట రాజయ్య అన్నారు. కేయూలో డిప్యూటీ రిజిస్ట్రార్‌గా, అదనపు పరీక్షల నియంత్రణాధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ ఈనెల 31న ఉద్యోగ విరమణ పొందబోతున్న సారయ్యను కేయూ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం బాధ్యులు గెస్ట్ హౌజ్ వద్ద బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా సారయ్య దంపతులను సన్మానించారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

హసన్‌పర్తి: రోడ్డు భద్రత నియమాలు పాటించాలని డీటీసీ డాక్టర్ శ్రీనివాస్ పుప్పాల సూచించారు. ఈమేరకు రోడ్డు భద్రతపై కిట్స్ కళాశాలలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తూ సెల్‌ఫోన్ ఉపయోగించవద్దన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ట్రాఫిక్ సీఐ సీతారెడ్డి, ఎంవీఐ కిశోర్, రాథోడ్, శ్రావ్య, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సతీష్‌చంద్ర, డాక్టర్ ప్రభాకరాచారి, తదితరులు పాల్గొన్నారు.

రజకులకు ప్రాధాన్యం ఇవ్వాలి

నయీంనగర్: సీట్ల కేటాయింపులో రాజకీయ పార్టీలు రజకులకు ప్రాధాన్యం ఇవ్వాలని, వాషర్‌మెన్ ఫెడరేషన్ ఏర్పాటు చేసి చైర్మన్‌ను నియమించాలని ఉమ్మడి వరంగల్ జిల్లా రజక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్యాల భిక్షపతి, సాంబరాజు, అంకయ్య, ఎల్లయ్య, రమేష్, అరుణ, రమేష్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

దత్తక్షేత్రంలో ఎమ్మెల్యేల పూజలు

హన్మకొండ కల్చరల్: వరంగల్ ములుగురోడ్డులోని వరద దత్తక్షేత్రాన్ని హనుమకొండ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య బుధవారం సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు వామన్‌రావు, శివరామకృష్ణ ప్రసాద్, బెండల అర్జున్‌రావు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించాలి

మడికొండ: మడికొండ – రాంపూర్ గ్రామాల మధ్య ఉన్న డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించాలని అడ్‌హక్ కమిటీ సభ్యులు కోరారు. ఈమేరకు తమతో కలిసి రావాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులను బుధవారం కలిసి విజ్ఞప్తి చేశారు. డంపింగ్ యార్డు సమస్యను ఎమ్మెల్యే నాగరాజు, మంత్రుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం పోరాడాలని సూచించారు. కార్యక్రమంలో అడ్‌హక్ కమిటీ సభ్యులు తాటిరెడ్డి కరుణాకర్ రెడ్డి, దువ్వ నవీన్, గాండ్ల భిక్షపతి, బొల్లికొండ వినోద్, కుమార్‌బాబు, దువ్వ కిషన్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్.ప్రవీణ్‌కుమార్‌కు స్వాగతం

హసన్‌పర్తి: స్వేరోస్ రాష్ట్ర అధ్యక్షుడు, బీఆర్‌ఎస్ నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు దేవన్నపేట టోల్‌గేట్ వద్ద నాయకులు బుధవారం ఘనస్వాగతం పలికారు. హనుమకొండలో పర్యటకు వస్తున్న క్రమంలో ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో స్వేరోస్ రాష్ట్ర నాయకుడు పుల్లా కిషన్, బీఆర్‌ఎస్ హసన్‌పర్తి మండల అధ్యక్షుడు డాక్టర్ బండి రజనీకుమార్, నాయకులు పాల్గొన్నారు.

అంధుల పాఠశాలలో పుట్టినరోజు వేడుకలు

రామన్నపేట: అలయెన్స్ క్లబ్ ఆఫ్ వరంగల్ చైతన్య క్లబ్ లీడర్ తాటిపాముల స్రవంతి పుట్టినరోజు వేడుకలను కొత్తవాడలోని లూయిస్ అంధుల పాఠశాలలో బుధవారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమె కేక్ కట్‌చేసి పిల్లలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అలయెన్స్ క్లబ్ వరంగల్ జిల్లా గవర్నర్ చిప్ప వెంకటేశ్వర్లు, వైస్ గవర్నర్ పెండెం మానస, మల్టిపుల్ కోఆర్డినేటర్ గజ్జెల ఓంకార లింగం శాస్త్రి, క్యాబినెట్ సెక్రటరీ పెంటకుమార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

విద్యారణ్యపురి: సమగ్ర శిక్ష ద్వారా అందజేసిన బెడ్ షీట్లను (దుప్పట్లు) హనుమకొండలోని అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులకు డీఈఓ వాసంతి బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదువుకోవాలని సూచించారు. జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ శ్రీనివాస్, స్పెషల్ ఆఫీసర్ దీప పాల్గొన్నారు.

కుశాల్‌కు సన్మానం

కాజీపేట: హనుమకొండలో కుశాల్ ఫౌండేషన్ చైర్మన్ మామిడాల కుశాల్‌ను గోప్రచారక సేవా సమితి సభ్యులు బుధవారం ఘనంగా సన్మానించారు. కాజీపేట పట్టణంలో కొంతకాలంగా గోమాత సంరక్షణ, పూజలో పాల్గొంటున్న కుశాల్ సేవలను గుర్తించి అభినందించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు నరేష్ రెడ్డి, నవీన్ కుమార్, కొక్కిరేణి శశిప్రీతం తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుడికి పరామర్శ

హసన్‌పర్తి: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మారపల్లి రాంచంద్రారెడ్డిని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు బుధవారం పరామర్శించారు. రాంచంద్రారెడ్డి తల్లి సుశీలమ్మ మృతి చెందగా, ఆమె మృతదేహం వద్ద నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, మాజీ ఎంపీటీసీ పిట్టల కుమారస్వామి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ చకిలం రాజేశ్వర్‌రావు, బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ తాళ్లపల్లి కుమారస్వామి ఉన్నారు.

విద్యార్థుల ప్రతిభను వెలికి తీసేందుకు..

విద్యారణ్యపురి: విద్యార్థుల్లోని ప్రతిభ, నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలను వెలికి తీసేందుకు మాక్ పార్లమెంట్ లాంటి కార్యక్రమాలు దోహదపడుతాయని హనుమకొండ హంటర్‌రోడ్డులోని గ్రీన్‌వుడ్ పాఠశాల డైరెక్టర్ డాక్టర్ భరద్వాజ నాయుడు అన్నారు. విద్యార్థులు పాఠశాలలో బుధవారం మాక్ పార్లమెంట్ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీకాంత్, ఏసీఓ హర్షవర్ధన్, సోషల్ డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడీ సుధీర్ పాల్గొన్నారు.

కేయూలో కొనసాగుతున్న క్రీడాపోటీలు

కేయూ క్యాంపస్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో ఖేల్ భారత్ క్రీడోత్సవాల్లో భాగంగా కాకతీయ యూనివర్సిటీలోని స్పోర్ట్స్ మైదానంలో వివిధ క్రీడాపోటీలు బుధవారం కూడా కొనసాగాయి. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు, గణిత విభాగం విభాగం అధిపతి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ భారవిశర్మ, నాయకులు అంబాల కిరణ్, కేయూ అధ్యక్షుడు సాయి, గేమ్స్ కన్వీనర్ గట్టు ప్రశాంత్, కో కన్వీనర్ అఖిల్ పాల్గొన్నారు.

ప్రకాశ్‌రావు కబ్జాకు పాల్పడలేదు

వరంగల్: వరంగల్ 3వ డివిజన్‌లో శిశుమందిర్‌కు కేటాయించిన భూమిని కబ్జా చేస్తుంటే అప్పటి కాలనీ అధ్యక్షుడు పిన్నింటి ప్రకాశ్‌రావు, కాలనీ వాసులతో కలిసి అప్పటి కలెక్టర్, సీపీల దృష్టికి తీసుకెళ్లగా వారు విచారణకు ఆదేశించారని కాలనీ వాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ స్థలంలో చిన్నపిల్లలు ఆడుకునేందుకు ఆట వస్తువులు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ప్రకాశ్‌రావు కబ్జా చేసినట్లుగా ప్రజావాణిలో కొంతమంది ఫిర్యాదు చేయడం సత్యదూరమని తెలిపారు.

మత్స్యకారుల సదస్సు పోస్టర్ల ఆవిష్కరణ

హన్మకొండ చౌరస్తా: వచ్చే నెల 6న హనుమకొండలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించనున్న మత్స్యకారుల జిల్లా సదస్సు వాల్‌పోస్టర్లను బాలసముద్రంలోని క్యాంపు కార్యాలయంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆవిష్కరించారు. టీఎంకేఎంకేఎస్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి గొడుగు వెంకట్, జిల్లా అధ్యక్షుడు నిమ్మల విజేందర్, సభ్యులు జునాగరి దుర్గయ్య, నీలం భానుచందర్, మొటం పవన్ కల్యాణ్, మాటూరి సమ్మయ్య, రాజయ్య, సదయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక

హన్మకొండ చౌరస్తా: 59వ డివిజన్‌కు చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు హనుమకొండ బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీలో బుధవారం చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు దీపక్‌రెడ్డి, అంకూస్, కొటిల్‌రెడ్డి, రాంప్రసాద్, సత్యనారాయణ, సతీష్, శ్రీకర్ పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన నేతలు

వరంగల్: రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివచరణ్‌రెడ్డిని వరంగల్ తూర్పు నియోజవర్గానికి చెందిన యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సలీం మహ్మద్ నేతృత్వంలో పలువురు నాయకులు హైదరాబాద్‌లో బుధవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గాజీ ప్రేమ్, ఎండీ.తాజ్, మంద నరేష్, కంప జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌కు శుభాకాంక్షలు

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా నియమితులైన ఎర్రం ప్రియాంక, ఆమె భర్త డాక్టర్ పులి అనిల్‌కుమార్‌ను నేషనల్ మెడికల్ అసోసియేషన్ వరంగల్ జిల్లా నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎన్ఎంఏ, రాష్ట్రీయ ఆర్పీఎస్కే రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వల్లబోజు మోహన్‌రావు, డాక్టర్ గుండా రవీందర్, డాక్టర్ మైదం రాజు, డాక్టర్ దుర్గాప్రసాద్, డాక్టర్ నవీన్‌కుమార్, డాక్టర్ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ప్రభాకర్‌రెడ్డి

న్యూశాయంపేట: ఈనెల 25 నుంచి 28వ తేదీ వరకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగిన సీపీఎం తెలంగాణ నాల్గో రాష్ట్ర మహాసభల్లో హనుమకొండ జిల్లా కార్యదర్శిగా కొనసాగుతున్న నగరానికి చెందిన జి.ప్రభాకర్‌రెడ్డిని రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బాలల సంరక్షణలో భాగస్వాములు కావాలి

- సైబర్ క్రైం ఏసీపీ విజయ్‌కుమార్


సదస్సులో మాట్లాడుతున్న ఏసీపీ

హన్మకొండ: బాలల సంరక్షణలో ఇంటర్‌నెట్ సర్వీస్ ప్రొవైడర్లు భాగస్వాములు కావాలని వరంగల్ పోలీసు కమిషనరేట్ సైబర్ క్రైం ఏసీపీ కె.విజయ్ కుమార్ కోరారు. సుబేదారిలోని అసుంత భవన్‌లో ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్, సైబర్ క్రైమ్ ఆధ్వర్యంలో ఇంటర్‌నెట్ సర్వీస్ ప్రొవైడర్స్, యూట్యూబ్ చానల్ నిర్వాహకులకు బాలల హక్కులు, బాలలపై ఆన్‌లైన్ లైంగిక దాడుల నివారణ – ఇంటర్‌నెట్ సర్వీస్ ప్రొవైడర్ల పాత్ర అనే అంశంపై బుధవారం సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఇంటర్‌నెట్ సర్వీస్ ప్రొవైడర్లు ఇంటర్‌నెట్ వినియోగంపై వినియోగదారులకు అవగాహన కలిగించాలని సూచించారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పి.వెంకన్న, ఎఫ్ఎంఎం సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎర్ర శ్రీకాంత్, కోఆర్డినేటర్ సుదర్శన్, బీఎస్ఎన్ఎల్ సబ్ డివిజనల్ మేనేజర్ భిక్షపతి, జిల్లా ఐరిచ్ మేనేజర్ శ్రీధర్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ జిల్లా సభ్యుడు డాక్టర్ సుధాకర్, జిల్లా బాలల సంరక్షణ అధికారి ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

కార్మిక ద్రోహులను అరెస్ట్ చేయాలి


బల్దియా ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

- బల్దియా కార్యాలయం ఎదుట ప్రజా సంఘాల నిరసన

వరంగల్ అర్బన్: వరంగల్ ఆజంజాహి మిల్లు యూనియన్ భవన స్థలాన్ని కొనుగోలు చేసిన యజమానులు, కూల్చివేతలో భాగస్వాములైన కార్మిక ద్రోహులపై చర్యలు తీసుకోవాలని పలు పార్టీల, ప్రజా సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు బల్దియా ప్రధాన కార్యాలయం ఎదుట బుధవారం నిరసన తెలిపారు. సుప్రీం కోర్టు తీర్పు మేరకు ఏజే మిల్లు స్థలంలోనే కార్మికులకు 200 గజాల చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించాలని, మడిపెల్లిలో స్థలాలు ఇవ్వడం సరికాదని అన్నారు. అనంతరం మంత్రి కొండా సురేఖను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఇనుముల శ్రీనివాస్, నలింగంటి రత్నమాల, సింగారపు బాబు, జగదీశ్వర్, దయాకర్, ఖాసీం, అరూరి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

'బేటీ బచావో.. బేటీ పడావో'పై అవగాహన


విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఉపాధ్యాయులు

హసన్‌పర్తి: నగరంలోని రెండో డివిజన్ వంగపహాడ్‌లోని జిల్లా పరిషత్ పాఠశాలలో బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంపై బుధవారం అవగాహన కల్పించారు. మహిళా శిశు సంక్షేమశాఖ, జిల్లా మహిళా సాధికారిత కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్‌ఎం సుజాత మాట్లాడుతూ బాలల హక్కులు, నిర్భయ చట్టాలు, పోక్సో, మద్యపానం, ధూమపానం వల్ల కలిగే దుష్పరిణామాలను, 100, 181, 14567, 1098 నంబర్ల ద్వారా అందనున్న సేవలను వివరించారు. తొలుత గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జెండర్ స్పెషలిస్ట్ స్వర్ణలత, మానస, అంగన్‌వాడీ టీచర్లు జ్యోత, సమ్మక్క పాల్గొన్నారు.